


# భయం

**వై.. ప్రసాదమూర్తి**

ఎవరు వాళ్ళు? ఎలా ఉంటారు? అసలు మనుషులేనా? మనుషులైతే మనుషుల్ని ఎందుకు చంపుతారు? ఒక మాతృమూర్తి గర్భం నుండి ఈ లోకంలోకి అడుగుపెట్టి, అందమైన ప్రకృతిమాత ఒడిలో ఆనందంగా ఆడుకుంటున్న అచ్చ తమలాంటి జీవుల్నే ఎందుకు చంపుతారు? ఎందుకు చనిపోతున్నామో, అసలు ఎందుకు చనిపోవాలో తెలీకుండానే ఒక మనిషి ఉన్నట్టుండి మాయమైపోవడం, దానికి ఒక మనిషి కారణభూతుడవ్వడం ఎప్పటికీ అర్థం కాని చిక్కు ప్రశ్నే కాబోలు! ఇన్ని కన్నీళ్ళని మూటగట్టుకుని ఏ ముక్తిని సంపాదించగలరు? ఏ దేవుని కరుణాకటాక్షాలకు పాత్రులు కాగలరు? తన బిడ్డలైనా, వాళ్ళు నెత్తుటి దారిని ఎంచుకుంటే ఏ తల్లి మాత్రం హర్షించగలదు? అసలు వాళ్ళ మొహాలు ఎలా వుంటాయో!

నగరంలో బాంబు పేలుళ్ళ విషయం చెవినపడిన క్షణం నుండి వాసంతికి కాలూ చెయ్యీ ఆట్టంలేదు. కూరగాయలు తరుగుతూ శనివారం సినిమాని ఎంజాయ్ చేస్తున్న వాసంతి చెవిలో పక్కింటి మహాలక్ష్మి బాంబు పేలుళ్ళ వార్తని బాంబులా పేల్చి వెళ్లిపోయింది. ''మావారు ఆఫీసునుండి ఎప్పుడో వచ్చేశారు, మీ వారు ఇంకా రాలేదల్లే వుందే! మీ అబ్బాయి, అమ్మాయి కూడా ఇంకా కాలేజీనుండి రాలేదు కాబోలు! మా పిల్లలు మాత్రం కాలేజీ నుండి నేరుగా ఇంటికి వచ్చేస్తారు. చదువు మాట ఎలా వున్నా పిల్లలు వేళకి ఇంటిపట్టు నుంటే అదే చాలమ్మా! అసలే రోజులు బాగాలేదు'' అంటూ మహాలక్ష్మి వెళ్తూవెళ్తూ మరోబాంబు పేల్చింది. వెంటనే వాసంతి భర్త సంజీవరావుకి ఫోను చేసింది. ఫోను చాలాసేపు రింగయ్యింది కాని అతను లిఫ్ట్ చెయ్యలేదు. అబ్బాయి మాధవ్‌కి చేసింది. అతను బస్సులో ఉన్నాను వచ్చేస్తున్నానని చెప్పడంతో కొంత ఊపిరి పీల్చుకుంది. కూతురు కుసుమ అప్పుడే ఇంటికి చేరుకుంది.

''కాలేజి వదిలి ఎంతసేపయ్యిందే! ఇప్పటి దాకా ఎక్కడ చచ్చావ్! పెత్తనాలేవీ వెలగబెట్ట కుండా నేరుగా ఇంటికే అఘోరించమని ఎన్నిసార్లు చెప్పాలి! లేటయితే ఫోనయినా చేసి చావొచ్చుగా? మీకు ఫోన్లు చెయ్యలేక నేనే చావాలా? మళ్ళీ ఫోను బిల్లు ఇంతొచ్చింది అంతొచ్చిందని ముగ్గురూ కలిసి నా మీదే దాడి''.

అకస్మాత్తుగా తల్లి తనమీద విరుచుకుపడ్డంతో కుసుమ విస్తుపోయింది. తల్లి మొహంలో అంత ఆందోళన తనెప్పుడూ చూడలేదు. ఏమయిందని అడగబోతూ అలవాటుగా టి.వి. వైపు తలతిప్పింది. టి.వి.లో బాంబుపేలుడు వార్తలు. లుంబినీ పార్కులో లేజర్ షోదగ్గర, కోఠిలో చాట్ భండార్ దగ్గర చెల్లాచెదురైన మానవ కళేబరాలు, విషయం క్షణాల్లో అర్థమైపోయింది. వళ్ళంతా చెమటతో తడి సిపోయింది. వణకిపోతున్న శరీరాన్ని ఎవరైనా గట్టిగా పట్టుకుంటే బావుండుననిపించింది. మృత్యువును కళ్ళతో చూస్తున్నట్టు అది తననే నీడలా తరుముకొస్తున్నట్టు కుసుమ నిలువెల్లా కంపించిపో యింది. ఏదో తప్పుచేసిన దానిలా తల్లి మొహంలోకి చూడలేకపోయింది. వెంటనే గదిలోకి పోయి తలుపువేసేసుకుంది. కూతురు ప్రవర్తనలో ఏదో అనుమానం దోబూచులాడింది వాసంతికి. భర్త ఫోను మోగడంలేదన్న ఆందోళనలో పెద్దగా పట్టించుకోలేదు. మరోసారి భర్తకి రింగిచ్చింది. ఈసారి ఫోను రింగుకూడా కాలేదు. ఒక ప్రక్క టి.వి. న్యూస్ ఛానల్ లో భయానక దృశ్యాలు, ఎంతకీ రింగుకాని భర్త ఫోను. వాసంతికి నిమిషని మిషానికి టెన్షన్ పెరిగిపోతోంది. సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న సంజీవరావు నేరుగా ఆఫీసునుండి బోట్స్ క్లబ్‌కి వెళ్ళి అక్కడ సాయంత్రం కాసేపు మిత్రులతో కాలక్షేపం చేసి ఇంటికి వస్తాడు. ఆరోజు బాంబు పేలిన లుంబిని వనం లేజర్ షో ప్రాంతం బోట్స్ క్లబ్‌కి ఆనుకునే ఉంటుంది. వాసంతిలో క్షణంక్షణం టెన్షన్ పెరగడానికి కారణం ఇదే. వార్తల్లో చూస్తున్నదాని ప్రకారం బోట్స్ క్లబ్‌కు ఏమీకాలేదని తెలుస్తోంది. కానీ తనభయం తనది.

''చెబితే వింటారా! ఇంట్లో ఆడదాని మాట లెక్కా జమా! అంతా నా ఖర్మగాని అందరూ ఇలా ఉంటారా! పనులు ముగించుకుని ఎవరి ఇళ్ళకు వాళ్ళు ఎంచక్కా చేరుకోవడం లేదా! మాయదారి ఫోను మోగిచావడంలేదు. ఎప్పుడైనా ఒక ఫోను చేసి ఇన్నింటికి వస్తాను అని చెప్పే అలవా టుంటేగా! ఇలాంటప్పుడు కాకపోతే ఇంకెందుకట ఈ ఫోను! ఊరు ఊరంతా ఇంత గగ్గోలుగా ఉంటే ఈ మనిషికి చీమకుట్టినట్టు కూడా లేదల్లే ఉంది. పిల్లలుకూడ ఈయనగారి దారి పట్టారు. ఎవరిష్ట మెచ్చినట్టు వాళ్ళు తిరగడం, ఇంటికి రావడం ముగ్గురూ ఇంటికి వచ్చేదాకా ప్రాణాలు అరచేతిలో పట్టుకుని మూలుగుతూ ఎదురుచూడ్డం దేవుడా ఈ ఫోను మోగించు స్వామి!''

మళ్ళీ ఫోను కనెక్టు కాలేదు. వాసంతికి గుండె దడ పెరిగిపోతోంది. పక్కింటి మహాలక్ష్మి మళ్ళీవ చ్చింది. ''వదినగారూ అమ్మాయి వచ్చినట్టుందిగా, అన్నయ్యగారు ఎక్కడున్నారో! ఏమైనా ఫోనుచే శారా! అబ్బాయి సంగతేంటంటిట. అన్నట్టు మా వారు కూడా ఫోను ట్రై చేస్తున్నారు మీవారికి, కల వటం లేదంట. ఇంతకీ బాంబులెందుకు పెడతా రంటారు వదినారు?'' తీరిగ్గా సోఫాలో కూర్చొని సుదీర్ఘ సంభాషణకే సిద్ధమైనట్టు ముచ్చటపెట్టింది మహాలక్ష్మి. వాసంతికి చిర్రెత్తుకొచ్చింది.


''నా పిండాకూడుకోసం, నీ శ్రాద్ధం కోసం'' వాసంతి కస్సుమంది. ''అయ్యోరామ అవేమాటలు వదినగారు'' అంటూ ఇంకాసేపుంటే మోగని ఫోను తన మొహాన కొట్టేట్టు ఉందని అర్థమై ''మా అయన్ని అడిగి తెలుసుకుంటాన్లెండి'' అనుకుంటూ వెళ్ళిపోయింది.

మరోసారి ఫోను ట్రై చేసింది వాసంతి. ఈసారి భర్త సెల్ రింగయ్యింది. అవతలివైపు రెస్పాన్స్ కోసం అరవైసార్లయినా దేవుడా దేవుడా అని వుంటుంది.

''ఏవండి ఎక్కడున్నారు? మీఫోను మోగక ఎంత హడలెత్తి ఛస్తున్నానిక్కడ. ఇంత జరిగినా ఇంటికి పెందరాడే రావాలని లేదా! బాంబులు కురి సినా క్లబ్బు మాత్రం నడుస్తుంది కాబోలు! ఒక ఫోనైనా చేసి చెప్పొచ్చుగా! ఇంట్లో ఒక్కత్తెనే టెన్ష న్‌తో చచ్చేది నేనేగా. నేను కూడా ఏదో ఉద్యోగం చేసుకుని బయటకు పోతేసరి, ఈ ఎదురుచూపుల పీడా విరగడైపోతుంది. నేను భరించలేను బాబు''.

''బండి మీదున్నాను, వచ్చేస్తున్నా. ఫోన్ పెట్టేయ్'' అంటూ భర్త ఫోను కట్ చేశాడు. భర్త కంఠం విన్న తరువాత వాసంతి ఒక సుదీర్ఘమైన నిట్టూర్పు విడిచి సోఫాలో చూలబడింది. యముడితో దిబ్బ లాడి భర్త ప్రాణాలు గెలుచుకున్నంత రిలీఫ్ ఫీల యింది. టీవీలో ఘటనాస్థలాలలను, చెల్లాచెదురైన మృతదేహాల ఖండిత అవయవాలను, పోలీసులు, అధికారులు, మంత్రులు, పోలీసు జాగిలాలు ఏవేవో దృశ్యాలను చూపిస్తున్నారు. నోరుతెరిచి అలాగే కూర్చుంది వాసంతి. ఇంతలో కొడుకు మాధవ్ కూడా ఇంటికి చేరుకున్నాడు. కొడుకు మీద సర్రున తాచుపాములా లేచింది.

''తాటిచెట్లల్లే ఎదిగావు. ఇంజనీరింగు ఫైనలి యర్ చదువుతున్నావు తల్లి మాట వినాలన్న జ్ఞానం ఉండొద్దా! అదిగో చూడు ఆ గోకుల్ చాట్ భండార్‌లో ఎంతమంది చచ్చిపోయారో! కుర్రాళ్ళే చాలామంది వున్నారు. ఎప్పుడూ రోడ్లమీద షికార్లే. మీకోసం చూసి చూసి టెన్షన్ తో ఎప్పుడో గుండాగి ఛస్తాను. అప్పుడింక హాయిగా ఇంటికి తాళం పెట్టి వీధుల్లోనే మకాం చేద్దురుగాని. అయినా మిమ్మల్ని అనేం లాభం, తండ్రి అడుగుజాడల్లో పిల్లలు నడు స్తున్నారు. అంతా నా ఖర్మ''. ఇంట్లోకి అప్పుడే వచ్చిన మాధవ్ విన్నట్టుగా కూడా లేడు. బూట్లు విప్పి ఒక మూలన విసిరి కొట్టాడు. అమ్మ వైపు అదోలా పిచ్చిగా చాలాసేపు చూశాడు.



మొహంనిండా కారుతున్న చెమట ప్రభావంతో అతని కళ్ళల్లో తడి ఆ త్లికి కనిపించలేదు. బట్టలు కూడా మార్చుకోకుండా గదిలోకివెళ్ళి విసురుగా తలుపేసుకున్నాడు.

''అబ్బో కోపాలకేం తక్కువలేదు. ఇహ ఆయన గారి విసురు చూడాలి. రానియ్ చెప్తా''. అనుకుంటూ మళ్ళీ టి.వి. వైపు దృషిట సారించింది. హుస్సేన్ సాగర్‌లో బుద్ధభగవానుడి ప్రశాంత విగ్రహం. ఆ అహింసామూర్తి కళ్ళెదుటే జరిగిన ఇంత దారుణం. కుర్చీల సందుల్లో ఇరుక్కున్న మృతదేహాలు. నేలంతా నెత్తుటి మడుగు. చూడకూడదనుకుంటూనే వాసంతి ఆ దృశ్యాలను చూస్తోంది. ఒళ్ళు జలదరించే భీభత్సం. '' ఎవరు వాళ్ళు! నాలాంటి ఏ తల్లిని అన్యాయం చేసిపోయిన బిడ్డలు! నాలాంటి ఏ భార్యల్ని అనాధల్ని చేసిపోయిన భర్తలు! అయ్యో అయ్యో అనుకుంటూ గుండెలు బాదుకుంటూ టి.వి. చూస్తోంది. కొడుకు, కూతురు ఇంటికి సురక్షితంగా చేరుకోవడం, భర్త నుండి ఫోను రావడంతో మృత్యు కోరలనుండి ప్రాణాలతో బయటపడినట్టు ఊరట కలిగినా, ఎందుకో గుండెలోతుల్లో మాత్రం బాంబులు పేలుతున్న శబ్దాల హోరు.

''ఇంతకీ ఎవరై వుంటారు? ఇది ఉగ్రవాదుల పనేనా? అయితే ఏ గ్రూపు? హైదరాబాదునే ఎందుకు ఎంచుకున్నారు? అమాయకుల ప్రాణాలను బలితీసుకోవడం ద్వారా వారు ఏమి సాధించాలనుకుంటున్నారు? ఇది శాంతిభద్రతల లోపమా, స్వార్థ రాజకీయాల పాపమా! ఎవరు దీనికి బాధ్యులు? ఈ అరాచకాలు అరికట్టలేమా? ఇలాంటివి అన్ని దేశాల్లోనూ జరుగుతున్నాయా? లేక పొన్ని దేశాల్లో నేనా? కొన్ని దేశాలోలనే అయితే ఎందుకు? ఈ ఉగ్రవాదం మూలాలను ఎవరూ అర్థం చేసుకోలేరా? అర్థం చేసుకున్నా, ఎవరూ పరిష్కరించలేని సమస్యా ఇది? ఈ కల్లోలానికి కారణాలే లేవా? ఎకర్కడ దీనికి ఆరంభం, ఎప్పుడు దీనికి అంతం? ఉగ్రవాదులు కూడా మనుషులేకదా! వారికీ భార్య పిల్లలు, వృద్ధులైన తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఉండేవుంటారు. మరి వాళ్ళకి మానవీయబంధాల పట్ల మమకారం లేదా? ఏ ప్రయోజనాలను ఆశించి వాల్ళు ఈ ఘాతుకాలకు పాల్పడుతున్నారు? అయ్యో ఒక మనిషి మరోమనిషి ప్రాణంతో ఆటలాడుకోవడం ఏమిటి? మృగాలు, నిద్రపోతున్న గ్రామాల మీద పడి అమాయకుల్ని చంపుకుతిన్నట్టు వింటాం అవి వాటి పొట్టకూటికోసమే అంత దారుణానికి ఒడిగడతాయి. మరివీళ్ళు? తమ చేతుల్లో బలయ్యేవాళ్ళతో వీళ్ళకెలాంటి సంబంధమూ లేదు. అమాయకుల ప్రాణాలతో ఎవరి ఆకలి తీరుతుందో!'' ఇలా ఎవరూ సమాధానం చెప్పలేని ప్రశ్నలు వాసంతి హృదయాన్ని సూదుల్లా గుచ్చిగుచ్చి వేధిస్తున్నాయి. ఇంట్లో షోకేసుల్లో ఉన్న బుద్ధుడి బొమ్మ చల్లని నేత్రాలతో తననే తదేకంగా చూస్తున్నట్టు వాసంతికి అనిపించింది. ఆ శాంతమూర్తి అరమోడ్పు కన్నుల నుండి కన్నీరు జాలువారుతున్నట్టు తోచి ఆమె కలవరపడింది. వెంటనే లేచి షోకేసు అద్దం జరిపి తెల్లని వస్త్రంతో ఆ పాలరాతి బొమ్మ ముఖాన్ని శుభ్రంగా తుడిచింది. ''భగవంతుడా! నువ్వు మళ్ళీ మళ్ళీ పుట్టాలి. మనిషి మనిషిలో పుట్టాలి. మా కన్నీళ్ళు తుడవాలి. మాతో నడవాలి. మా ఇళ్ళల్లో మా కళ్ళల్లో మా వీధుల్లో మా చుట్టూ నువ్వే నడవాలి. స్వామీ నీకు తప్ప ఈ చీకట్లను చెరిపే శక్తి ఎవరికీ లేదు. వెలిగే ప్రతి దీపం నువ్వే స్వామీ స్వామీ'' ఇలా పలవరిస్తూ భర్త అడుగుల సవ్వడి కోసం ఆరాటపడుతోంది వాసంతి. ఏ అడుగుల చప్పుడూ లేకుండా మహాలక్ష్మి మళ్ళీ వచ్చింది.

''అబ్బాయి వచ్చినట్టున్నాడే!'' అంటూ వాసంతి ఎదురుగా తీరుబడిగా కూర్చుంది మహాలక్ష్మి ''ఆయన కూడా వచ్చేస్తున్నారు లెండి''. వాసంతి కొంచెం పెడసరంగానే అన్నా, కూల్ గానే వున్నట్టు కనిపించింది మహాలక్ష్మి. '' ఇంతకీ వదిన గారూ, ఉగ్రవాదులు ఎలావుంటారు?''

''ఈ సారి వాళ్ళను కలిసినప్పుడు మీ దర్శనం చేసుకోమని చెప్తాలెండి''.

''తప్పనిసరిగా చెప్పండి. నన్నుగాని కలిస్తే వాళ్లను కడిగిపారేస్తా''.

మహాలక్ష్మి ఈ మాటలు ఎంత సీరియస్‌గా అందో అంత నవ్వొచ్చింది వాసంతికి.

''ఏమంటారు వదినా! నాక్కూడా కొంచెం చెప్పండి'' వాసంతి నవ్వుతూ అడిగింది. '' ఇంతకు ముందు ఏదో కోపంలో చిరాకు పడ్డానని, ఏమీ అనుకోవద్దని సంజాయిషి కూడా ఇచ్చుకుంది. దాంతో మహాలక్ష్మి మరింత ఉత్సాహంగా తనధోరణిలో తాను మాటలు సాగించింది.

'' ఏం చెప్పడం ఏమిటి వదినగారు, కాస్త బుద్ధి చెబుతాను. చేతనైతే, చేతులుంటే కన్నీళ్ళు తుడవమంటాను. మనుషులైతే, ప్రేమను పంచమంటాను. ద్వేషాన్ని కాదు. పెట్టగలిగితే దీపాలు పెట్టమంటాను. బాంబుల్ని కాదు. గుడ్డివాళ్ళకు కళ్ళివ్వమంటాను, కుంటివాళ్ళకు కాళ్ళివ్వమంటాను, ముసలివాళ్ళకు చేతి కర్రలవ్వమంటాను. మారణాయుధాలను కాదు, మనుషుల మనుసుల్లోని మమతల్ని కనుక్కోమంటాను. ఒక తల్లి పాలు తాగివుంటే పిల్లలకు తల్లులవ్వమంటాను.'' ఉద్రేకంగా మాట్లాడుతూ మహాలక్ష్మి ఎటో చూస్తూ కన్నీళ్ళు తుడుచుకుంది. ఈ అమాయకురాలి గుండెల్లో ఇన్ని మాటల ఊటలున్నాయా అని వాసంతి నివ్వెరపోతూ మహాలక్ష్మిని తదేకంగా చూస్తూ కాసేపు అలాగే వుండిపోయింది. మంచి మాటలకే మనుషుల బుద్ధులు మారిపోతే బుద్ధుడి రాకతోనే ప్రపంచం మారిపోయేది కదా అనుకుంటూ మహాలక్ష్మి ప్రక్కనే కూర్చుని, తనకు కూడా ఏమి మాట్లాడాలో తెలీక మౌనం వహించింది. అంతలోనే భర్త సంజీవరావు ఇంట్లో అడుగుపెట్టాడు. మహాలక్ష్మి వస్తానండి అంటూ నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది. రాగానే సునామీలా తనమీద విరుచుకుపడుతుందనుకున్న వాసంతి భోరుమని ఏడుస్తూ అతన్ని గట్టిగా వాటేసుకోవడంతో కాసేపు అలాగే నిలబడిపపోయాడు. ఆమె తలను సుతారంగా నిమురుతూ అలాగే వుండిపోయాడు. జరిగింది చెబితే తను ఇంకా బెదిరిపో





## విశాలనేత్రాలకు మోక్షం ఎప్పుడు?

పిలకా గణపతిశాస్త్రిగారి విశాలనేత్రాలు కథను సినిమాగా తీయాలని ప్రసిద్ధ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు చాలా ఉబలాటపడ్డారు. కానీ తన కోరిక నెరవేర్చుకోకుండానే కన్ను మూశారు. అందులో హేమసుందరి పాత్రకు హేమమాలిని చాలా బావుంటుందని అప్పట్లో సినిమా అభిమానులంతా ముక్త కంఠంతో చెప్పారు. ఒక దశలో ఆదుర్తి కూడా వారితో ఏకీభవించారు. అయితే ఏదీ అనుకున్నట్టు జరగలేదు. ఆ సినిమా స్క్రిప్టు హక్కులు ఇప్పుడు గోపీకృష్ణా సంస్థ అధినేత కృష్ణంరాజు దగ్గరున్నాయి. ఆయనా చాలా కాలం నుంచి ఆ సినిమా తీదామని అనుకుంటూనే వున్నారు. కానీ ఎప్పటికప్పుడు ఏదో ఒక కారణంగా ఆ ప్రాజెక్టు వాయిదా పడుతోంది.

తుంది. అందునా బాంబుపేలుడు షాకునుండి అతనింకా తేరుకోలేదు. మిత్రులతోపాటు తానూ చాలా శ్రమపడ్డాడు. అంగాలు తెగి నెత్తుటిమడుగుల్లో కొట్టుకొంటూ అల్లల్లాడిపోయిన ఆ అమాయకుల ముఖాలే ఇంకా అతనికి గుర్తుకొస్తున్నాయి. అన్నిటికంటే తానుకూడా వారిలో ఒకరిగా కవాల్సింది ఏదో శక్తి తనను కాపాడిందనుకుంటేనే నరాలు తెగిపోతున్నాయి. నెమ్మదిగా భార్యను సోఫాలో కూర్చోబెట్టి తానూ పక్కనే కూర్చున్నాడు.


''పిల్లలేరి వాసూ''!


''లేటుగా వచ్చింది చాలక ఒక్క మాటకూడా మాట్లాడకుండా తలుపులు బిడాయించుకుని మరీ పడుకున్నారు. ఎన్నిసార్లు చెవిలో జోరీగలా వాగినా లెక్కుందా?అసలు నన్నొక మనిషిలా ఎవరైనా చూస్తేగా ఈ ఇంట్లో'' మళ్ళీ వాసంతి తన ధోరణిలో తాను మాట్లాడ్డం ప్రారంభించింది. భర్తను విదిలించుకుంటూ లేచి డైనింగ్ టేబుల్ మీద సగం తరిగిన కూరగాయల మీద తన కోపాన్ని ప్రదర్శించింది.

''అమ్మా కుసుమా! బంగారు తల్లీ! నాన్నా మాధవ్!'' సంజీవరావు గట్టిగా అరిచి పిలవాలనుకున్నాడు కాని, ఆ పిలుపు కొన్ని మైళ్ళ దూరం నుండి వచ్చినట్టుగా వుంది. అయినా ఆ పిలుపుకోసమే ఎదురుచూస్తున్నట్టు రెండు గదుల తలుపులూ ఒక్కసారే తెరుచుకున్నాయి. 'నాన్నా' అంటూ కొడకూ కూతురూ తండ్రిని కౌగలించుకున్నారు. వాసంతికి వళ్ళు మండిపోయింది. గంటల తరబడి వాళ్ళకోసం ఎదురుచూసి లక్షలటన్నుల టెన్షన్ సుత్తిదెబ్బలు భరించిన తనను ఏమాత్రం పట్టించుకోలేదన్న బాధ ఆమె కోపాన్ని మరింత పెంచింది.

'' ఆహా! బంగారు తల్లీ, నాన్నా, కన్నా! ఓహూ హూ! ఎక్కించుకోండి. ఇంకా బాగా మీద ఎక్కించుకోని తొక్కించుకోండి. ఈ పిలుపులేగా వాళ్ళని చెడగొడుతోంది. కారిపోతోంది ప్రేమ. ఇందాకట్నించి మీ కోసం పిచ్చిదానిలో ఎదురుచూస్తున్న నేను పోయాను''. వాసంతి కోపంతో వణికిపోతోంది.. నెమ్మది నెమ్మదిగా భర్త, కూతురు, కొడుకు ఆమె దగ్గరకి చేరారు. అలా మౌనంగా ఆమెనే చాలాసేపు చూశారు. కూతురు ముందు తల్లిని చుట్టుకొని భోరున ఏడ్చింది. తరువాత కొడుకు. ముగ్గురినీ శాంతపరచడానికి సంజీవరావు చాలా తంటాలు పడాల్సి వచ్చింది. ముగ్గురూ కాస్త కోలుకున్నారనిపించాక తాను అదృష్టవశాత్తు ఆ రోజు ఎలా బయటపడింది వాళ్ళకు వివరించాడు. అప్పుడే భయం కోరలనుండి కొద్దికొద్దిగా బయటకు వస్తున్న వాసంతి పిడుగు పడ్డట్టు ఉలిక్కిపడి అలాగే భర్తను చూస్తూ వుండిపోయింది. తరువాత కుసుమ తల్లిని విడిచి ప్రక్క కుర్చీలో కూర్చుని టవల్‌తో ముఖం తుడుచుకుంది. అంతకుముందు రోజే తను ఫ్రెండ్స్‌తో కలిసి లుంబినీపార్కుకు వెళ్ళినట్టు, లేజర్ షో కూడా చూసినట్టు, సమయంకూడా ఇంచుక మించు అదే అన్నట్టు భయం భయంగా చెప్పింది. ఎవరి ముఖంలోకీ ముఖ్యంగా తల్లిని చూసే ధైర్యం లేక ఎటో చూస్తూ వుండిపోయింది కుసుమ. అందుకే ఇంటికి రాగానే టి.వి. లో బాంబు పేలుడు వార్తలు చూసి వణకిపోతున్న శరీరాన్ని ఎలా అదుపు చేయాలో తెలీక గదిలోకి పోయి మంచంమీద పడిపోయినట్టు బెదురుతూ బెదురుతూ చెప్పింది. కూతురి మాటలతో ఇంకా కంపించిపోయింది వాసంతి. పిడుగుమీద పిడుగు తనమీదే పడుతున్నట్టు, నిలువెల్లా కరెంటు షాక్ కొట్టినట్టు ఊగిపోయింది. కూతురు మాటలు విని సంజీవరావు కూడా అదిరిపడ్డాడు. అంతలో కొడుకు తాను మాత్రం ఏమీ తక్కువ తినలేదని తెండుకు అలా వున్నది తడబడుతూ చెప్పాడు. సరిగ్గా బాంబు ప్రేలుడికి అరగంట ముందే గోకుల్ చాట్ భండార్ దగ్గర ఫ్రెండ్స్‌తో చాట్ తిని, కోఠిలో సిటీబస్సు ఎక్కినట్టు, బస్సులో ఉండగానే బాంబు పేలిన సంగతి తనకుతెలిసినట్టు నీల్కు నములుతూ చెప్పాడు. దీనితో అక్కడున్న మిగతా ముగ్గురూ తమ మధ్యనే బాంబు పేలినట్టు అదిరిపడ్డారు. ఇక వాసంతి పరిస్థితి వర్ణనాతీతం. తన ఇంట్లో మూలమూలనా మృత్యువు మాటేసినట్టు ఆమె కదిలిపోయింది. ఒక్క వెంట్రుకవాసిలో తన ప్రాణసమానమైన ముగ్గురికీ చావు తప్పినట్టు అర్థమైపోయింది. తాను భయపడిందంతా నిజమేనని ఆమె విలవిలా కొట్టుకుంది. '' ఇప్పుడైతే తప్పించుకున్నారు, రేపు ఎలా? ఈ రోజు లుంబినీపార్కు, రేపు ఇంకో పార్కు... ఈ రోజు ఎవరో, రేపు నావాళ్ళే కావచ్చు. ఎప్పుడైనా ఎక్కడైనా ఎలాగైనా ఎవ్వరైనా చనిపోవచ్చు. కారణం ప్రకృతి విలయతాండవం కాదు. మనిషే. తన పగతో, తన కసితో, తన విద్వేషంతో ఏ మాత్రం సంబంధం లేని, కనీసం తను ఒక్కసారి కూడా చూడని, మాట్లాడని మనుషుల్ని బలితీసుకునేది మనిషే. ఏమిటిలా! ఎందుకిలా!

అప్పటివరకూ బడబడా మాట్లాడుతూ వాళ్ళకు చీవాట్లుపెట్టిన వాసంతి ఉన్నట్టుండి కూర్చున్న కుర్చీలోంచి కింద పడిపోయింది. తల్లి నోటి నుండి ఏమి తిట్లు వినాల్సి వస్తుందోనని బెదిరిపోయిన కొడుకు, కూతురు ''అమ్మా'' అంటూ ఆమెను పట్టుకుని కుదుపుతున్నారు. ''వాసూ వాసూ'' అంటూ భర్త పిలుస్తున్నాడు. బాంబు వార్తల్ని టీవీల్లో బిక్కు బిక్కుమంటూ చూస్తున్న చుట్టుపక్కలవాళ్ళకు ఆ అరుపులు వినపడలేదు. వాసంతి లేవలేదు. *



## నాలుగు తరాల నటీమణులు

నటి లక్ష్మి ఇంట్లో నాలుగు తరాల నటీమణులు వున్నారు. లక్ష్మి అమ్మమ్మ నుంగం బాక్కం జానకి ముప్ఫయిలు, నలభైల్లో వచ్చిన సీతా వనవాసం, మాయా బజార్, లలితాంగి, హరిశ్చంద్ర వంటి సినిమాల్లో నటించింది. తల్లి రుక్మిణి శ్రీవల్లి, మళ్ళీ పెళ్ళి వంటి చిత్రాల్లో నటించింది. ఇక లక్ష్మి సంగతి అందరికీ తెలిసిందే జూలి, దిక్కట్ర పార్వతి, మల్లెపూవు వంటి సినిమాల్లో నటించింది. ఆమె కూతురు ఐశ్వర్య కూడా చాలా తమిళ చిత్రాల్లో నటించింది. అలా ఆ ఇంట్లో నాలుగు తరాల మహిళలూ తారలే.